సాక్షి
పార్వతీపురం మన్యం

సోమవారం । 26 । మే । 2025



హత్యా..?ఆత్మహత్యా?
పూసపాటిరేగ మండలంలోని కోనాడ గ్రామంలో యువకుడి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
- 8లో



డిజిటల్ దెబ్బ.. దొంగల అబ్బా..!
ఎంత నైపుణ్యం కలిగిన దొంగలైనా ప్రస్తుత రోజుల్లో డిజిటలైజేషన్ ముందు తలొగ్గాల్సిందే.
- 8లో



అక్రమ రవాణాకు మార్గం!
రామభద్రపురం మండల కేంద్రంలోని జాతీయ రహదారి మీదుగా నిషేధిత వస్తువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది.
- 8లో

న్యూస్‌రీల్

నేడు పీజీఆర్ఎస్‌కు హాజరు కానున్న జిల్లా కలెక్టర్

సీతంపేట: సీతంపేటలో సోమవారం జరగనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ హాజరు కానున్నారని ఐటీడీఏ అధికార వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. గిరిజనులు తమ సమస్యలపై వినతులు సమర్పించవచ్చన్నారు.

1143 పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించాలి

సీతంపేట: గిరిజన గురుకులాల్లో భర్తీ చేయనున్న 1143 టీచర్ పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్‌కు ఆదేశించినట్టు గిరిజన జేఏసీ నాయకుడు బి.ఉమామహేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పని చేస్తున్న టీచర్లు జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హైదరాబాద్ ఇటీవల వచ్చిన కమిషన్ సభ్యులను యూనియన్ నాయకులు కలిశారు. అంతకు ముందు ఢిల్లీలో పలుమార్లు కలిసి సమస్యలను వివరించారు. స్పందించిన కమిషన్ సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్‌లో పోస్టులు డీఎస్సీలో చూపించలేదని, గిరిజన గురుకులం అధికారులు గురుకుల పాఠశాలల్లో ఖాళీలు ఎందుకు చూపించారని ప్రశ్నించారు. గురుకులం బైలాస్‌కు విరుద్ధంగా అవుట్ సోర్సింగ్‌లో టీచర్స్ అండ్ లెక్చరర్స్ పోస్టులను భర్తీ చేసినందుకు అందరిని సీఆర్‌టీలుగా మార్పు చేయాలన్నారు. మూడు రోజుల్లో ఇది అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారన్నారు. ఇది తుది తీర్పు అన్నారు. లేదంటే కమిషన్ తగు చర్యలు తీసుకుంటుందన్నారు. కమిషన్ తీర్పుతో గిరిజన గురుకులాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు న్యాయం జరుగుతుందని ఆదివాసీ జేఏసీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

కీచక ఉపాధ్యాయుడు!

రేగిడి: మండలంలోని ఓ జెడ్పీ ఉన్నత పాఠశాలలో కీచక ఉపాధ్యాయుడి రాసలీలలు ఆలస్యంగా సామాజిక మాధ్యమాల ద్వారా ఆదివారం వెలుగులోకి వచ్చాయి. జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికపై ఉపాధ్యాయుడు పాఠశాల పని చేసే రోజుల్లో కన్నేశాడు. మాయమాటలు చెప్పి లొంగదీసుకొని గర్భవతిని చేసినట్టు విశ్వసనీయ సమాచారం. బాలిక తండ్రి గతంలో మృతి చెందగా.. తల్లి వేరే చోట పనులకు వలస బాటు పట్టింది. దీంతో బాలిక తాత గారి ఇంటి వద్ద ఉంటూ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకుంటుంది. పాఠశాలకు వేసవి సెలవులిచ్చిన తరువాత బాలిక తల్లి వద్దకు వెళ్లింది. తల్లి తన బిడ్డ అనారోగ్యంతో బాధపడుతున్నట్టు గుర్తించింది. వెంటనే వైద్యులను సంప్రదించగా బాలిక గర్భం దాల్చినట్టు ఉందని చెప్పినట్టు సమాచారం. కుటుంబ పరువుకు సంబంధించిన విషయం కావడంతో బయటకు రానివ్వకుండా గోప్యం పాటించినట్టు సమాచారం.

జిల్లా కేంద్రం.. అభివృద్ధికి దూరం..!

నాడు... గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న సదుద్దేశంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాల పునర్విభజన చేపట్టారు. అందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తూ గిరిజన ప్రాంతాలను, జిల్లా కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాల సముదాయాలు, మున్సిపల్ పార్క్, తోటపల్లి ఐటీడీఏ పార్క్ ఏర్పాటుతో పాటు జిల్లా కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్దారు.

నేడు... కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం గడుస్తున్నా జిల్లాను అభివృద్ధి చేసే దాఖలాలు కన్పించడం లేదు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పట్టణానికి దశాబ్దాల కాలం నాటి సమస్య అయిన డంపింగ్ యార్డు తరలిస్తామని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి దాదాపు 12 నెలలు కావస్తున్నా హామీ ఊసే ఎత్తడం లేదు. ఎన్నికల నాటి హామీలు విస్మరించారని, పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించడం లేదని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- మురికి కూపంలా వరహాలగెడ్డ
- వర్షం కురిస్తే రహదారులు, ఆర్టీసీ కాంప్లెక్స్ జలమయం
- బైపాస్ కాలనీ వాసులకు తప్పని అవస్థలు
- దశాబ్దాల డంపింగ్ యార్డు తరలింపు ఉత్తిదేనా!



డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఎన్నికల వేళ ఇచ్చిన ఏ ఒక్క హామీని జిల్లా కేంద్రంలో అమలు చేయకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. చినుకు పడితే జిల్లా కేంద్రంలోని ప్రజల కష్టాలు అన్నీఇన్నీ కావు. పట్టణ నడిబొడ్డు నుంచి వెళ్లే వరహాల గెడ్డ సమస్యకు పరిష్కారం లేదు. తాగునీటి కష్టాలు తప్పడం లేదు. పారిశుధ్య చర్యలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. డంపింగ్ యార్డు తరలింపు లేదు. ఈ సమస్యలన్నింటినీ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లో పరిష్కరిస్తామని చెప్పిన ఎమ్మెల్యే నేడు ఏడాదవుతున్నా పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు.



వరహాలగెడ్డలో చెత్త

వరహాల గెడ్డకు మోక్షమెప్పుడో..

జిల్లా కేంద్రం నడిబొడ్డున ప్రవహిస్తున్న వరహాల గెడ్డ వర్షం వస్తే చాలు పట్టణంలో పలు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. ఎన్నికల ముందు పట్టణానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే విజయచంద్ర కనీసం పట్టించుకోవడం లేదని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం పడితే చాలు పట్టణంలో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురికావడమే కాకుండా ముంపు ప్రాంతాలైన బైపాస్ కాలనీ వాసులు భయభ్రాంతులకు గురవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. వరహాల గెడ్డ ఆక్రమణలు, పూడికలు తీయకపోవడంతో మండలంలో కురిసిన వర్షానికి పట్టణంలో పలు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. ఇళ్లలోకి వర్షపు నీరు చేరి ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది కావస్తున్నా వరహాల గెడ్డలో పూడికలు తీయకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వీటిపై చర్యలు చేపట్టి తమను ఆదుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

తూతూ మంత్రంగా 'స్వచ్ఛ పార్వతీపురం'

పట్టణంలోని పలు వార్డుల్లో పూడికలు తీయకపోవడం, చెత్త ఎక్కువగా పేరుకుపోవడంతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తూతూ మంత్రంగానే నిర్వహిస్తున్నట్టు పట్టణ వాసులు వాపోతున్నారు. పట్టణంలోని కొత్తవలస, వైకెఎం కాలనీ, గూడ్స్‌షెడ్ రోడ్డు, ఇందిరా కాలనీ, జగన్నాథపురం కాలనీల కాలువల్లో పూడికలు పేరుకుపోయి దోమల బెడద పెరిగిందని ఆ కాలనీవాసులు వాపోతున్నారు. వార్డుల్లో కాలువలు తీసి రోగాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం సాధ్యమేనా..

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి ప్రధాన సమస్య అయిన డంపింగ్ యార్డును గత ప్రభుత్వం ఆర్‌కె.బట్టివలస గ్రామ సమీపంలో తరలించేందుకు చర్యలు చేపట్టింది. అందుకు తగ్గ ప్రణాళికలు రూపొందించింది. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కాలేదు. డంపింగ్ యార్డును తరలిస్తామని కూటమి ఎమ్మెల్యే విజయచంద్ర హామీ ఇచ్చి రెండు నెలల్లో పరిష్కారం చూపుతామని చెప్పి సంవత్సరం గడుస్తున్నా పట్టణ ప్రధాన సమస్య అయిన డంపింగ్ యార్డుకు పరిష్కారం చూపకపోవడంతో పట్టణ వాసుల్లో నిరుత్సాహం నెలకొంది.

తాగునీటి సమస్యకు పరిష్కారం లేదా...

పట్టణంలోని తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వస్తే బురద నీరు.. వేసవి కాలం వస్తే నాలుగు రోజులకొకసారి తాగునీటి సరఫరా చేయడంతో పట్టణ వాసులు దాహంతో అల్లాడుతున్నారు. కొన్ని వార్డుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో మూడు రోజులకొకసారి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్రంలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపేందుకు గత ప్రభుత్వం రూ.65కోట్లతో సమగ్ర తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభించారు. వాటిని పునఃప్రారంభించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

డంపింగ్ యార్డుకు పరిష్కారం చూపాలి

పార్వతీపురం పట్టణ ప్రధాన సమస్య అయిన డంపింగ్ యార్డును తరలిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. ప్రస్తుతం అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యారు. గతంలో ప్రతిపాదించిన విధంగా డంపింగ్ యార్డును పట్టణం నుంచి దూర ప్రాంతాలకు తరలించి చెత్త నుంచి పట్టణానికి విముక్తి కల్పించాలి.

– ఎస్.అనిల్, పార్వతీపురం పట్టణం



పట్టణంలోని 20వ వార్డులో కుళాయిల ద్వారా వస్తున్న బురద నీరు



పట్టణంలో ట్యాంకర్లతో నీటి సరఫరా(ఫైల్)

శాశ్వత పరిష్కారం చూపాలి

పట్టణంలోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. ప్రస్తుత వేసవి కాలంలో నాలుగైదు రోజులకొకసారి కుళాయి ద్వారా తాగునీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చి శాశ్వత పరిష్కారం చూపాలి.

– సూర్ల ఉమామహేశ్వరి, గూడ్స్‌షెడ్ రోడ్డు, పార్వతీపురం

ముంపు నుంచి తప్పించాలి

మాది బైపాస్ కాలనీ, మా కాలనీలో వర్షం పడితే చాలు ఇళ్లలోకి వర్షపు నీరు చేరుతుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా వరహాలగెడ్డ పూడికలు తీయించేవారు. ఏడాది గడుస్తున్నా గెడ్డలో పూడికలు తీయడం లేదు. వర్షం పడితే మా కాలనీలోని ఇళ్లలో వర్షపు నీరు చేరుతుంది. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు చేపట్టాలి.

– ఎస్.మహేశ్వరరావు, బైపాస్ కాలనీ

ప్రతీ ఒక్కరిని యోగాంధ్రలో భాగస్వాములు చేయాలి

- జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



పార్వతీపురం టౌన్: జిల్లా వ్యాప్తంగా జూన్ 21వ తేదీ వరకు నిర్వహిస్తున్న యోగాంధ్రా కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరిని భాగస్వాములు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. ప్రస్తుత జీవనశైలిలో ప్రతి ఒక్కరూ పని ఒత్తిడిలో ఆరోగ్యం పట్ల సరైన దృష్టి సారించడం లేదని, యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరిగి నడుచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించి భాగస్వాములను చేయాలన్నారు. అయితే యోగాను శిక్షకుల ద్వారా వారి సమక్షంలో మాత్రమే చేయాలని, ఇందుకోసం మాస్టర్ ట్రైనీలను సిద్ధం చేసినట్టు తెలిపారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మే 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించేలా షెడ్యూల్‌ను అధికారులకు పంపామన్నారు. షెడ్యూల్‌లో సూచించిన మేరకు కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. నెల రోజుల పాటు గ్రామ, వార్డు, మండల, జిల్లా స్థాయిలో జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీల ద్వారా ప్రభుత్వ ఉద్యోగులతో వారి కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు తదితరులు అందరూ పాల్గొనేలా చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ యోగాంధ్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కొండంత కష్టం!

ఈ చిత్రంలో కొండ రహదారుల్లో ఉన్న ఓ ఖానాపై అనారోగ్యంతో దుప్పటి కప్పుకొని పడుకుని ఉన్న యువతి పేరు సవర విజయశాంతి. వారం రోజుల కిందట సీతంపేట మండలం గుమ్మడ గ్రామం నుంచి బంధువుల ఇంటికి రేగుమానుగూడ వచ్చింది. రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతుంది. ఆదివారం చలి జ్వరం తీవ్రం కావడంతో ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు 108కి కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. అయితే గ్రామ రహదారి పూర్తిగా రాళ్లు తేలి ఉండడంతో 108 వాహనం గ్రామానికి వచ్చే పరిస్థితి లేదు. దీంతో విజయశాంతిని బంధువులు గ్రామం నుంచి కొంత దూరం తీసుకువచ్చి ఇలా ఖానాపై పడుకోబెట్టారు. 108 వాహనం వచ్చే వరకు సపర్యలు చేశారు. కాసేపటికి 108 వాహనం రావడంతో సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

- సీతంపేట



'ఉగ్ర' విచారణలో విస్తుపోయే నిజాలు!

- మూడో రోజూ కొనసాగిన విచారణ


విజయనగరం క్రైమ్: బాంబు పేలుళ్ల కుట్ర కేసులో విజయనగరం పోలీసుల కస్టడీలో ఉన్న సిరాజ్, సమీర్‌లను మూడో రోజు ఆదివారం కూడా విచారించారు. ఇందులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చినట్టు భోగట్టా. కోర్టు ఆదేశాలతో ఎన్ఐఏ అధికారుల నుంచి తమ కస్టడీలోకి తీసుకున్న విజయనగరం పోలీసులు స్థానిక పీటీసీలో మూడో రోజు కూడా విచారణ కొనసాగించారు. రెండో రోజు శనివారం రాత్రి సిరాజ్ కాస్త అస్వస్థతకు గురవడంతో సర్వజన ఆసుపత్రి నుంచి ఇద్దరు ప్రత్యేక వైద్యాధికారులను రప్పించి పీటీసీలోనే చికిత్స చేయించినట్టు సమాచారం. తొలి రెండు రోజులు కాస్త నెమ్మదిగా దర్యాప్తు సాగించిన దర్యాప్తు బృందం అధికారులు మూడో రోజు తమదైన కోణంలో విచారణ సాగించినట్టు తెలిసింది. ముఖ్యంగా గడిచిన ఆరు నెలలుగా హైదరాబాద్‌లోనే సమీర్‌తో ఉన్న విజయనగరం వాసి సిరాజ్ అక్కడే బాంబు పేలుళ్లకు పన్నాగం పన్నినట్టు విచారణలో తేలినట్టు తెలిసింది. మానవ బాంబుగా సిద్ధమైన సిరాజ్, సమీర్‌లు ముస్లిమేతరులే లక్ష్యంగా సోషల్ మీడియా వేదికగా పేలుళ్లకు పథక రచన చేసినట్టు తెలిసింది. వరంగల్ ఫర్హాన్, ఢిల్లీ బాదర్ నుంచి వీరికి ఉన్న సంబంధాలపై కూపీ లాగుతున్నట్టు సమాచారం. మూడో రోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విచారణ సాగినట్టు భోగట్టా. తిరిగి సాయంత్రం 5.30 గంటలకు మొదలైన విచారణ రాత్రి వరకు కొనసాగినట్టు తెలిసింది.



ఉగ్రవాదులను విచారణ చేసేందుకు పీటీసీలోకి బ్లాక్ స్కార్పియోలో వెళ్తున్న అధికారులు

రాష్ట్ర స్థాయి చెస్ చాంపియన్‌గా సేతుమాధవన్

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 160 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ నువ్వా..నేనా అనే విధంగా ఏడు రౌండ్లలో క్రీడాకారులు పోటీపడ్డారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీల్లో శ్రీకాకుళంకు చెందిన ఫిడే మాస్టర్ వేలుమహంతి సేతుమాధవన్ ఆరున్నర పాయింట్లు సాధించి రాష్ట్ర స్థాయి చెస్ చాంపియన్‌గా నిలిచాడు. అలాగే విశాఖపట్నంకు చెందిన అభిరామ్ ఆరు పాయింట్లతో ద్వితీయ, విజయవాడకు చెందిన సీనియర్ క్రీడాకారుడు మల్లేశ్వరరావు తృతీయ స్థానంలో నిలిచారు. ఎస్.కోటకు చెందిన వినీల్‌కార్తీక్ నాలుగో స్థానం, విశాఖపట్నంకు చెందిన జయనాగరాజు ఐదవ స్థానంలో నిలిచారు. ఓపెన్‌లో పది మందికి, అండర్-17 విభాగంలో పది మందికి, వివిధ కేటగిరీల్లో మొత్తం 30 మంది క్రీడాకారులకు రూ.1.30 లక్షలు నగదు బహుమతితో పాటు మెమొంటోలు, ప్రశంసా పత్రాలు జీఎంఆర్ ఐటీ తరఫున అందించారు. ఈ టోర్నమెంట్‌కు చీఫ్ ఆర్బిటార్‌గా కేవీ జ్వాలాముఖి వ్యవహరించగా ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.అరుణ్‌కుమార్ వ్యవహరించారు. క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముఖ్య అతిథిగా హాజరైన జీఎంఆర్ ఐటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ జె.గిరీష్, ప్రిన్సిపాల్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ అన్ని ఏర్పాట్లు చేశారు.



రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి అందుకుంటున్న సేతుమాధవన్

దివ్యాంగ చిన్నారుల కోసం

ఐఈఆర్‌పీల ఇంటింటి సర్వే



గరుగుబిల్లిలోని భవిత కేంద్రంలో చదువుతున్న చిన్నారులు

- ఈ నెల 13 నుంచి ప్రారంభమైన సర్వే
- దివ్యాంగులకు నాలుగు రకాల అలవెన్సులు
- గుర్తించేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలు

పార్వతీపురం: దివ్యాంగ చిన్నారులను గుర్తించేందుకు సహిత విద్య ఐఈఆర్‌పీ(ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్)లు ఇంటింటి సర్వే ప్రారంభించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఇంటికి పరిమితం కాకుండా వారిని శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన భవిత కేంద్రాల పరిధిలో ఈ గుర్తింపునకు ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలు మిగిలిన పిల్లల మాదిరిగానే అన్ని అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా ప్రతి మండలానికి ఒక భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేసి సహిత విద్యను అమలు చేస్తున్నారు. జిల్లాలోని 15 మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున 15 భవిత కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు మిగిలిన పిల్లలతో సమానంగా విద్యను అందించడంతో పాటు వారికి అవసరమైన పరికరాలను అందిస్తున్నారు. సమాజంలో ఇంకా మిగిలి వున్న ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించడానికి జిల్లా విద్యాశాఖాధికారి, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్‌ల పర్యవేక్షణలో భవిత కేంద్రాల ఐఈఆర్‌పీలు సర్వే చేస్తున్నారు. ఇందులో భాగంగా దివ్యాంగ పిల్లలందరికీ అవసరమైన విద్యను అందించడం, ప్రతి చిన్నారిని వారి వయసుకు తగ్గట్టుగా పాఠశాలలో చేర్పించడమే లక్ష్యంగా ఈ సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే దివ్యాంగ పిల్లల విద్యను డిజిటలైజేషన్ చేసి, టాబ్స్‌ను అందజేస్తున్నారు.

ప్రత్యేక సేవలు

మానసిక దివ్యాంగుల్లో విద్యార్థి దశలో ఉన్న వారికి విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు ప్రతీ వారం ఫిజియోథెరపీ సేవలను అందజేస్తున్నారు. ప్రత్యేక అవసరాలు గల వారిని గుర్తించి, వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించడం, పాఠశాలలకు రప్పించేలా భవిత కేంద్రంలోని ఐఈఆర్‌పీలు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 13వ తేదీ నుంచి ప్రతి మండలంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గుర్తించేందుకు ఐఈఆర్‌పీలు ప్రత్యేక సర్వే చేపట్టారు. జిల్లాలో 1,749 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఉన్నారు. వీరిలో 1738 మంది భవిత కేంద్రాలలో విద్యనభ్యసించగా, మిగిలిన 11మందిని వారి ఇళ్ల వద్దనే ప్రత్యేకంగా విద్యనందిస్తున్నారు. వీరు కాకుండా, గతేడాది జూన్‌లో నిర్వహించిన సర్వేలో పాఠశాలలకు రాకుండా ఇంటి వద్ద ఉన్న 286 మందిని గుర్తించారు. ప్రస్తుతం నిర్వహించిన సర్వే అనంతరం గుర్తించిన వారిని అంగన్‌వాడీ కేంద్రంలోగానీ ప్రాథమిక పాఠశాలల్లోగానీ చేర్పిస్తారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో కూడా సెలవు రోజుల్లోనే సర్వే చేయాలని అధికారులు ఐఈఆర్‌పీలను ఆదేశించారు. స్థానిక అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ల సహాయంతో సర్వే నిర్వహిస్తున్నారు. ఇంతవరకు జిల్లాలో 18మందిని గుర్తించారు.



కాశయ్యపేటలో గుర్తించిన దివ్యాంగ చిన్నారి

ప్రత్యేక వైద్య శిబిరాలు

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో గత ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో మెడికల్ అసెస్మెంట్ క్యాంపులు నిర్వహించారు. పార్వతీపురం, కురుపాం, పాలకొండ, సాలూరు తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన శిబిరాల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన ఉపకరణాలను గుర్తించి, వాటి కోసం దరఖాస్తులు స్వీకరించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని గుర్తించి, మెంటల్లీ రిటార్డెడ్ (ఎంఆర్), హియరింగ్ ఇంపైర్డ్(హెచ్ఐ), విజువల్లీ ఇంపైర్డ్(వీఐ), సెరిబ్రల్ పాలసీ కింద నాలుగు విభాగాలుగా విభజించారు. ఈ క్యాంపులకు పాఠశాలలకు రాకుండా ఇంటి వద్ద ఉండే వారు కూడా వచ్చారు.

భవిత కేంద్రాల్లో ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లల వివరాలు..

మండలం	ప్రస్తుతం ఉన్న విద్యార్థులు
బలిజిపేట	139
భామిని	86
గరుగుబిల్లి	62
గుమ్మలక్ష్మీపురం	78
జియ్యమ్మవలస	75
కొమరాడ	67
కురుపాం	118
మక్కువ	137
పాచిపెంట	103
పాలకొండ	197
పార్వతీపురం	179
సాలూరు	109
సీతంపేట	114
సీతానగరం	173
వీరఘట్టం	101
మొత్తం	1738

ప్రతి ఒక్కరినీ గుర్తించేందుకే..



ప్రతి ఒక్కరినీ ఈ పథకం కిందకు తీసుకు రావాలనే ఉద్దేశంతో సర్వే నిర్వహిస్తున్నాం. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు విద్యను అందిస్తాం. భవిత కేంద్రాలకు రాని వారికి హోమ్ బేస్డ్ ఎడ్యుకేషను అందిస్తున్నాం. భవిత కేంద్రాల పరిధిలో విద్యతో పాటుగా అవసరమైన సేవలు అందించేందుకు సర్వే నిర్వహిస్తున్నాం. ప్రతి చిన్నారిని గుర్తించి, భవిత కేంద్రాల్లో చేర్పిస్తాం. ఇంతవరకు జిల్లాలో 18మందిని గుర్తించి వారిని అంగన్‌వాడీ కేంద్రాలు, భవిత కేంద్రాలలో చేర్పించాం.

– వి.భానుమూర్తి, సహిత విద్య కోఆర్డినేటర్, పార్వతీపురం మన్యం జిల్లా

నాలుగు రకాల అలవెన్స్‌లు

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నాలుగు రకాల అలవెన్స్‌లను ప్రభుత్వం అందజేస్తోంది. ఎస్కార్ట్, ట్రాన్స్‌పోర్ట్, హోమ్ బేస్డ్, రీడర్ అలవెన్సును అందజేస్తున్నారు. అంధులకు రీడర్ అలవెన్స్‌గా 10 నెలలకు రూ.2,000 అందజేస్తున్నారు. బడికి వచ్చే వారికి ఎస్కార్ట్ అలవెన్స్ కింద ఒక్కో విద్యార్థికి పది నెలలకు రూ.3,000 అందిస్తున్నారు. ట్రాన్స్‌పోర్టు అలవెన్స్ పది నెలలకు రూ.3,000 ఇస్తున్నారు. గర్ల్ చైల్డ్ అలవెన్స్ 10 నెలలకు రూ.2,000 అందజేస్తున్నారు. హోమ్ బేస్డ్ అలవెన్స్ పది నెలలకు రూ.3,000 అందజేస్తున్నారు.

క్లుప్తంగా

కమ్మవీధిలో అగ్నిప్రమాదం

- రూ. 5.50 లక్షల ఆస్తినష్టం



దగ్ధమైన ఇళ్లు, సామగ్రి

విజయనగరం క్రైమ్: నగరంలోని కమ్మ వీధిలో ఆదివారం మధ్యాహ్న 1 గంట ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఆ వీధిలోని ఒక గృహిణి ఇంట్లో దేవుడి దగ్గర దీపం పెడుతుండగా ఒక్కసారిగా అగ్గిపుల్ల పక్కకు ఒరిగి ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక దళ అధికారులు సంతోష్, మహేష్ బృందం ఫైర్ ఇంజిన్‌తో కమ్మవీధిలో అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశానికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. సూబట్ల సూర్యారావు ఇంట్లో ఈ ప్రమాదం సంభవించగా రూ.లక్ష నగదు, బంగారం, ఇంట్లో ఉన్న టీవీ, బీరువా దగ్ధమయ్యాయి. అలాగే ఆ ఇంటిని ఆనుకుని ఉన్న సూబట్ల రాజు, సూబట్ల లక్ష్మణరావుల ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి.

పిడుగుపాటుకు రెండు ఆవుల మృతి



బలిజిపేట: మృతి చెందిన ఆవులు

బలిజిపేట: మండలంలోని పెద్దింపేటలో పిడుగుపాటుకు రెండు ఆవులు మృతిచెందాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పెద్దింపేటలో మధ్యాహ్నం వర్షం కురిసి ఆగిపోయిన తరువాత రైతులు ఆవులను మేతకు విప్పి గ్రామం శివారుకు వెళ్తున్న సమయంలో పిడుగులు పడడంతో ఆవులు మృత్యువాత పడినట్లు గ్రామస్తులు తెలిపారు. మజ్జి కృష్ణమూర్తి, టి.సూర్యనారాయణలకు చెందిన రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. కృష్ణమూర్తి ఆవు రూ.30వేలు, సూర్యనారాయణ ఆవు రూ.40వేలు ఖరీదు ఉంటాయని గ్రామస్తులు తెలిపారు.

కుక్క కాటుతో మరో రెండు ఆవులు



పాలకొండ రూరల్: అట్టలిలో మృతి చెందిన ఓ పాడిఆవు

పాలకొండ రూరల్: మండలంలోని అట్టలి గ్రామంలో నివసిస్తున్న శిర్లి తౌడమ్మ చెందిన రెండు పాడి ఆవులు పిచ్చికుక్క కాటుకు గురై ఆదివారం మృతి చెందాయి. దీంతో బాధితురాలు కన్నీటి పర్యంతమైంది. తమ కుటుంబ పోషణలో భాగమైన ఆవులను కుక్క కరిచేయడంతో అవి మృతి చెందినట్లు బాధితురాలు భోరుమంది. ఇటీవల మండలంలోని రుద్రిపేట గ్రామంలో కుక్కకాటుకు గురై ఓ లేగ దూడ మరణించిన ఘటన మరువక ముందే మరో ఆవులు చనిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో స్వైర విహారం చేస్తున్న కుక్కలపై దృష్టి పెట్టాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

31న జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు



జిల్లా పోటీల బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు బేబీ నాయన

బొబ్బిలి: ఈనెల 31న పట్టణంలో 18వ జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించనున్నట్లు బొబ్బిలి తైక్వాండో క్లబ్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే బేబీ నాయన తెలిపారు. ఈ మేరకు ఆదివారం దీనికి సంబంధించిన బ్యానర్‌ను ఆవిష్కరించారు. క్లబ్ కార్యదర్శి చెలికాని వేణుగోపాలరావు ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 200 మంది హాజరై జూనియర్,సబ్ జూనియర్, జూనియస్ క్యాడెట్, సీనియర్ విభాగాల్లో జరిగే పోటీల్లో తలపడతారన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు వచ్చే నెల 9 నుంచి అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతారని కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹230

హత్యా..? ఆత్మహత్యా?

- కోనాడలో అనుమానాస్పదంగా యువకుడి మృతి
- కుమారుడి మృతిపై పోలీసులకు తండ్రి ఫిర్యాదు
- శవాన్ని బయటకు తీసి పోస్ట్‌మార్టం చేసిన వైద్యులు



బొడ్డు భూలోక మృతదేహం,(ఇన్‌సెట్లో) భూలోక (ఫైల్)



అనాథలైన పిల్లలు హాసిని, రజిని

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ గ్రామంలో యువకుడి మృతిపై పలుఅనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు, గ్రామస్తులు ధ్రువీకరిస్తుండగా తమ కుమారుడిని హత్య చేశారంటూ మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేసి, పూడ్చిపెట్టిన మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదికతో యువకుడిది హత్యా? లేక ఆత్మహత్యా? అనేది తేలనుంది. ఈ సంఘటన వివరాల్లోకి వెళ్తే.. కోనాడ గ్రామానికి చెందిన బొడ్డు భూలోక (35), గ్రామానికి చెందిన బడి సూరిబాబుల మధ్య చిన్నపాటి విషయమై వాగ్వాదం జరిగింది. భూలోక తన కుమార్తె హాసినిని దుర్భాష లాడడంతో వరుసకు మేనమామ అయిన సూరిబాబు పిల్లలను ఎందుకు దుర్భాషలాడుతున్నావంటూ భూలోకను మందలించడంతో ఇద్దరి మధ్య వివాదం ప్రారంభమైంది. జరిగిన విషయాన్ని సూరిబాబు సమీపంలోని బంధువులకు చెబుతుండగా, మద్యం మత్తులో ఉన్న భూలోక వెనక నుంచి మంచం కోడుతో సూరిబాబు తలపై బలంగా మోదడంతో తీవ్ర రక్త స్రావమైంది. వెంటనే హుటాహుటిన చికిత్స నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై సూరిబాబు బంధువులు బొడ్డు అశోక్, బొడ్డు చినభూలోక, బొడ్డు అప్పలస్వాములు కోపోద్రిక్తులై రాత్రి 10 గంటల సమయంలో భూలోక ఇంటికి వెళ్లి చేయిచేసుకున్నారు. అకారణంగా సూరిబాబును ఎందుకు కొట్టావంటూ కొట్టారు. దీంతో మనస్తాపం చెందిన భూలోక నిమిషాల వ్యవధిలో రెండుసార్లు ఉరివేసుకోవడానికి ప్రయత్నించడంతో గ్రామస్తులు వారించి అడ్డుకున్నారు. అ తరువాత అర్ధరాత్రి 2 గంటల సయంలో భూలోక, తండ్రి అప్పన్నతో కలిసి మద్యం తాగాడు. సీతంపేటలో రంపం పనికోసం ఆదివారం తెల్లవారు జామున సూకరాజు అనే కాం ట్రాక్టర్ ఇంటికి వచ్చి భూలోకను పిలుస్తుండగా తలుపులు తీయకపోవడంతో గదిలో చూడగా ఉరివేసుకుని ఉన్నాడు. దీంతో ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో భూలోక మృతదేహాన్ని సంప్రదాయం ప్రకారం శ్మశానంలో పూడ్చిపెట్టారు. అంత్యక్రియల అనంతరం ఇంటికి వెళ్లిన మృతుడి తండ్రి అప్పన్న తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని, హత్య చేశారని పూసపాటిరేగ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన భోగాపురం రూరల్ సీఐ జి. రామకృష్ణ, పూసపాటిరేగ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్‌లు కోనాడ శ్మశానానికి వెళ్లి పూడ్చిపెట్టిన మృతదేహాన్ని గ్రామస్తుల సహకారంతో బయటకు తీయించి వైద్యులతో మ్మశానంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదికతో బొడ్డు భూలోకది హత్యా? లేక ఆత్మహత్యా? అనే విషయం తేలనుంది.

అనాథలైన పిల్లలు

మృతుడు భూలోక భార్య భూలోకమ్మ రెండేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. తాజాగా భూలోక మృతి చెందడంతో పిల్లలు అనాథలయ్యారు. వారికి హాసిని, రజిని అనేకుమార్తెలు, అక్షియవర్ధన్ అనే కుమారుడు ఉన్నారు. అనుకోని ప్రమాదంలో తల్లి భూలోకమ్మ, తండ్రి భూలోకలు మృతి చెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలుగా మిగిలారు. సంఘటనా స్థలానికి వచ్చిన వారంతా దేవుడా ముగ్గురు పిల్లలకు దిక్కెవరంటూ కన్నీరు పెట్టుకున్నారు. బొడ్డు భూలోక మృతిపై ఫిర్యాదు మేరకు పూసపాటిరేగ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విచారణ చేస్తున్న పోలీసులు

నాలుగు పర్యాటక ప్రదేశాల్లో యోగా ప్రదర్శన

- 10న ఉపాధి హామీ సిబ్బందితో రాష్ట్రస్థాయి కార్యక్రమం
- కొనసాగుతున్న యోగా శిక్షణ

విజయనగరం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరికీ యోగా గొప్పతనాన్ని వివరించి, వారి చేత యోగాసనాలను అభ్యసింపజేసే ప్రక్రియకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగానే ఇప్పటికే జిల్లాలో ఎంపిక చేసిన వందమంది మాస్టర్ ట్రైనీలు, టీఓటీలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణ రెండో రోజు ఆదివారం రాజీవ్‌ఇండోర్ స్టేడియంలో కొనసాగింది. జిల్లా కేంద్రంలో ప్రత్యక్షంగా, హాజరుకాని వారికి ఆన్‌లైన్ ద్వారా శిక్షణ నిర్వహించారు. యోగా గురువులు, టీవోటీలు ఉత్సాహంగా శిక్షణలో పాల్గొన్నారు.

నాలుగు ప్రాంతాల్లో ప్రదర్శనలు

జిల్లాలోని నాలుగు పర్యాటక ప్రాంతాల్లో భారీస్థాయిలో యోగా ప్రదర్శించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. దీని ప్రకారం ఈనెల 30న రామనారాయణం, జూన్ 6న చింతపల్లి బీచ్ వద్ద, 12న రామతీర్థం వద్ద, 19న శ్రీ గొర్రిపాటి బుచ్చి అప్పారావు తాటిపూడి రిజర్వాయర్ వద్ద యోగా ప్రదర్శనలు నిర్వహించనున్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో అంశాల ప్రాతిపదికగా ప్రతి జిల్లాకు ఒక థీమ్‌ను ప్రభుత్వం కేటాయించింది. దీనిలో భాగంగా జిల్లాలో వేలాది మంది గ్రామీణ ఉపాధి హామీ పథకం వర్కర్లతో జూన్ 10న యోగా ప్రదర్శన నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.



రాజీవ్ క్రీడామైదానంలో యోగా శిక్షణ పొందుతున్న గురువులు, మాస్టర్ ట్రైనీలు

విజయనగరంలో 10 ప్రాంతాల్లో..

జిల్లా కేంద్రం విజయనగరంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పది యోగా వీధులను ఎంపిక చేశారు. రెండు రోజులకు ఒకసారి పట్టణంలోని ఏదో ఒక ప్రధాన మార్గంలో ఉదయాన్నే యోగాసన ప్రదర్శన నిర్వహిస్తారు. శిక్షణ పొందిన వారితో పాటు, సామాన్య ప్రజలు సైతం ఈ యోగా స్ట్రీట్‌కు వచ్చి ఆసనాలను అభ్యాసం చేయవచ్చు. దీనిలో భాగంగా సోమవారం ఉదయం శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద ప్రధాన రహదారిపై యోగా ప్రదర్శన నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

వైభవంగా ఆదిత్యహృదయ హోమం

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరకాండ హవనం, గాయత్రి రామాయణం, ఆదిత్య హృదయ హోమాలను వైభవంగా జరిపించారు. అనంతరం స్వామి సన్నిధిలో సీతారాముల కల్యాణాన్ని వేడుకగా జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్, వరప్రసాద్, రామగోపాల్ పాల్గొన్నారు.



యాగశాలలో ప్రత్యేక హోమాలు జరిపిస్తున్న అర్చకులు

భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి పూజలు

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని ఉమా సదాశివాలయంలో మాస శివరాత్రి పూజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో తొలుత గణపతి పూజ చేసి, అనంతరం శివునికి పంచామృతాలు, వివిధ ఫలరసాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక హోమాలు చేశారు. మాస శివరాత్రి పురస్కరించుకుని భక్తులంతా ఉపవాసాలు ఆచరిస్తూ దైవదర్శనం చేసుకోవడం విశేషం. పూజల అనంతరం భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.



శివునికి పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

రెండు లారీలు ఢీ కొని బిహార్ వాసి మృతి



సైలేస్ సాహూ మృతదేహం

రామభద్రపురం: మండలంలోని కొండకెంగువ వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవేపై రెండు లారీలు ఢీ కొనడంతో జరిగిన ప్రమాదంలో బిహార్ వాసి ఒకరు ఆదివారం మృతిచెందారు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బిహార్‌లోని పాట్నా జిల్లాకు చెందిన సైలేస్ సాహు(40) జీవనోపాధి నిమిత్తం గడిచిన మూడేళ్లుగా హెచ్‌జీ ఇన్‌ఫ్రా కంపెనీలోని కొండకెంగువ వద్ద ఏర్పాటు చేసిన క్యాంపు-1లో పనిచేస్తున్నాడు. అయితే పనినిమిత్తం పాచిపెంట వద్ద ఏర్పాటు చేసిన క్యాంపు-2కు వెళ్లి పని ముగించుకుని తిరిగి క్యాంప్-1కు లారీలో వస్తుండగా హెచ్‌జీ ఇన్‌ఫ్రా కంపెనీ నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ఆ హైవేకు సంబంధించిన మరో లారీ ఎదురుగా వస్తూ ఢీ కొంది. దీంతో సాహు ప్రయాణిస్తున్న లారీ తలుపు తెరుచుకుని కిందపడడంతో లారీ చక్రాలు, రోడ్డు పక్కనే ఉన్న డివైడర్ మధ్య నలిగి ముద్దయ్యాడు. అదే లారీలో ఉన్న డ్రైవర్ శివ ఠాకూర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించేందుకు వీలు లేనంతగా ముద్దవడంతో బాడంగి సీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. డ్రైవర్ శివ ఠాకూర్ ఫిర్యాదు మేరకు ఎస్సై వి. ప్రసాదరావు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. మృతుడు సాహుకు భార్య, పాప, బాబు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలు

గజపతినగరం: మండల కేంద్రంలోని రైల్వే బ్రిడ్జి సమీపంలో ట్రైన్‌లో ప్రయాణిస్తూ ఓ వ్యక్తి జారిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గజపతినగరం రైల్వే స్టేషన్ మీదుగా విశాఖ వెళ్తున్న పాసింజర్ ట్రైన్‌లో నుంచి విజయవర్మ అనే వ్యక్తి జారి పడి తీవ్ర గాయాల పాలు కావడంతో స్థానికులు గుర్తించి ఆస్పత్రికి తరలించగా ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం మహారాజా ఆస్పత్రికి తరలించారు.

డిజిటల్ దెబ్బ..దొంగల అబ్బా..!

- సెల్‌టవర్ లొకేషన్, ఫింగర్ ప్రింట్స్ ద్వారా నిందితుల గుర్తింపు
- వైజాగ్ నుంచి జన్మభూమి రైలులో ప్రయాణించిన దుండగులు
- రెక్కీ నిర్వహించిన మహిళ కోసం గాలింపు
- తెనాలిలో ఇద్దరు దొంగలను పట్టుకున్న పోలీసులు
- వారితో పాటు మరికొంత మంది ఉన్నట్లు సమాచారం



చీపురుపల్లి: ఎంత నైపుణ్యం కలిగిన దొంగలైనా ప్రస్తుత రోజుల్లో డిజిటలైజేషన్ ముందు తలొగ్గాల్సిందే. విరివిగా దొంగతనాలు జరుగుతు న్నప్పటికీ పోలీస్‌శాఖలో పెరిగిన డిజిటలైజేషన్ కారణంగా ఆ చోరీలను ఛేదించడం సునాయాసమైంది. అందులో భాగంగానే చీపురుపల్లి పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన చోరీతో పాటు వృద్ధులను గాయపరిచిన దుండగులు డిజిటలైజేషన్ పుణ్యమాని అతికొద్ది గంటల్లోనే పట్టుబడ్డారు. శుక్రవారం అర్ధరాత్రి పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో వారణాశి సురేష్ నివాసంలో 20 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లడంతో పాటు ఇంట్లో ఉన్న ఇద్దరు వృద్ధులను తీవ్రంగా గాయపరిచిన సంఘటన తెలిసిందే. శనివారం ఉదయానికి ఈ సంఘటన పట్టణాన్ని ఉలిక్కిపడేలా చేసింది. దీంతో రంగంలోకి దిగిన డీఎస్పీ ఎస్.రాఘవులు నేతృత్వంలోని పోలీస్ అధికారులు డిజిటలైజేషన్ సహకారంతో దుండగులను పట్టుకున్నట్లు సమాచారం. చీపురుపల్లిలో చోరీకి పాల్పడిన దొంగలను తెనాలిలో పట్టుకుని జిల్లాకు తీసుకుంచ్చినట్లు తెలిసింది.

డిజిటలైజేషన్‌దే కీలకపాత్ర

దొంగలను పట్టించడంలో డిజిటలైజేషన్ కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా చోరీ జరిగిన ఇంటికి సమీపంలోని సెల్‌టవర్ పరిధిలో సమాచారాన్ని పోలీసులు సేకరించినట్లు తెలిసింది. చోరీ జరిగిన సమయంలో ఆన్‌లో ఉన్న ఫోన్ నంబర్లను సేకరించారు. దీంతో పాటు క్లూస్ బృందాలు సేకరించిన ఫింగర్ ప్రింట్స్‌తో మేచ్ అవడంతో తెనాలికి చెందిన ముఠాగా దుండగులను గుర్తించారు. వెంటనే గుంటూరు పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో తెనాలి పోలీసులు వారిని పట్టుకున్నారు. అయితే చీపురుపల్లిలో చోరీకి పాల్పడిన దుండగులు విశాఖపట్నం చేరుకుని అక్కడి నుంచి జన్మభూమి రైలులో తెనాలి వెళ్లినట్లు తెలిసింది.

రెక్కీ చేసిన మహిళ కోసం..

ఇదిలా ఉండగా చీపురుపల్లిలో జరిగిన ఉదంతానికి ప్రధాన సూత్రధారిగా ఓ మహిళ ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. చోరీ జరగడానికి మూడు రోజుల ముందే ఆ మహిళ చీపురుపల్లి చేరుకుని రెక్కీ నిర్వహించి ఇక్కడి ఇల్లు, పరిసరాల ఫొటోలు దుండగులకు పంపించినట్లు తెలిసింది. ఆ మహిళ వేసిన స్కెచ్ ప్రకారమే చోరీ అమలు చేసినట్లు సమాచారం. అయితే తెనాలిలో ఇద్దరు దుండగులు మాత్రమే పట్టుబడిన నేపథ్యంలో ఆ మహిళతో పాటు మిగిలిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం.

బురదలో కూరుకుని బాలుడి మృతి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లుంబేసు పంచాయతీ మూలజమ్ము గ్రామంలో బురదలో కూరుకుపోయి ఓ బాలుడు మృతిచెందాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బిడ్డిక చిరంజీవి, నీరజల కుమారుడు అశోక్ (7) స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని చెరువులో ఆడుకునేందుకు శుక్రవారం వెళ్లాడు. కాసేపు చెరువులో ఉన్న నీటిలో ఆడుకున్నారు. అంతలో ఇంకొంచెం చెరువు మధ్యలోకి వెళ్లిన అశోక్ బురదలో కూరుకుపోయాడు. ఎంతకీ బయటకు రాకపోవడంతో స్నేహితులు హుటాహుటిన గ్రామానికి వెళ్లి కుటుంబసభ్యులకు తెలియజేయడంతో అంతా వచ్చి చెరువులో వెదికారు. చాలా సేపటి తర్వాత బురదలో కూరుకుపోయిన అశోక్ శవమై కనిపించాడు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



బురదలో కూరుకుపోయి మృతిచెందిన అశోక్

సన్మానం

విజయనగరం టౌన్: స్థానిక గురజాడ గ్రంథాలయం ఆవరణలో విజయభావన సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో హనుమ భక్తితత్వంపై ప్రసంగం ఇచ్చే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడేపల్లిగూడెం ప్రాంతానికి చెందిన తెలుగు పండితుడు పి.రామచంద్రరావు హాజరై, కాసేపు ప్రసంగించారు. దాస్య భక్తికి హనుమను గొప్ప ఉదాహరణగా చెప్పవచ్చని, సర్వదేవతా స్వరూపం హనుమంతుడని పేర్కొన్నారు. భోగ మోక్షాలకు, ఇహపరాలకు రక్ష హనుమంతుడేనన్నారు. అనంతరం ఆయనను సమాఖ్య ప్రతినిధులు సత్కరించారు.

గోపాలకృష్ణ మాస్టారుకు అవార్డు ఆనందదాయకం

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామానికి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు పుర్లి గోపాల కృష్ణం నాయుడికి తెలుగు వెలుగు సాహితీవేదిక నంది అవార్డు రావడం ఆనందదాయకమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్‌లు అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని అంబకండి గ్రామంలో గోపాలకృష్ణంనాయుడు మాస్టారును దుశ్శాలువాలు, బొకేలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంగ్ల ఉపాధ్యాయుడు అయినప్పటికీ తెలుగుభాషపై ఉన్న మక్కువతో విద్య, సాంస్కృతిక సేవా రంగంలో విశిష్టమైన కృషిచేసి అవార్డు పొందడంతో ఈ ప్రాంతానికే మంచి పేరు వచ్చిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, ఎంపీటీసీ పుర్లి సత్యవతి, లావేటి గణపతిరావునాయుడు, లావేటి శ్రీహరిరావు, లావేటి వెంకట వేణుగోపాలనాయుడు, ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గోపాలకృష్ణ మాస్టారు దంపతులను దుశ్శాలువ, మెమెంటోలతో సత్కరిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ తలే రాజేష్ తదితరులు

అక్రమ రవాణాకు మార్గం!

- రామభద్రపురం మీదుగా నిషేధిత వస్తువుల రవాణా

రామభద్రపురం: మండలకేంద్రంలోని జాతీయ రహదారి మీదుగా నిషేధిత వస్తువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. తాజాగా రూ.96 లక్షల విలువ చేసే నిషేధిత సిగరెట్లను రామభద్రపురం పంచాయతీ కార్యాయం వద్ద స్థానిక పోలీసులతో పాటు విజిలెన్స్, వాణిజ్యపనుల శాఖాధికారులు శనివారం పట్టుకున్న విషయం విదితమే. రామభద్రపురం మండల కేంద్రం అంతరరాష్ట్ర కూడలి కావడంతో పాటు ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు బోర్డర్‌లో ఉన్నందున ఈ మండల కేంద్రం మీదుగా గంజాయి, ఖైనీ గుట్కా, నల్లమందు వంటి మాదక ద్రవ్యాలతో నిషేధిత వస్తువులు అక్రమ రవాణా సులభతరమవుతోంది.

పదినెలల్లో అక్రమ రవాణా జరిగిన కొన్ని సంఘటనలు..

గతేడాది జూన్ 16వ తేదీన స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఒడిశా రాష్ట్రం కొరాపుట్ పరిసర ప్రాంతాల్లో కొనుగోలు చేసి విజయవాడకు అక్రమ రవాణా చేస్తున్న కిలోన్నర గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.

- గతేడాది ఆగస్టు 16వ తేదీన కొట్టక్కి చెక్ పోస్టు వద్ద అక్రమంగా ఒడిశా నుంచి తరలిస్తున్న రెండున్న కిలోల గంజాయి పట్టుకున్నారు.
- గతేడాది అక్టోబరు 7న మండలంలోని ముచ్చర్లవలస పరిధిలో గల పెట్రోల్ బంకు సమీపంలో గల రాజస్థాన్ డాబా వద్ద ఎస్సై వి. ప్రసాదరావు సిబ్బందితో కలిసి నల్లమందు పట్టుకున్నారు
- గతేడాది డిసెంబర్ 12న కొట్టక్కి చెక్ పోస్టు వద్ద ఒడిశా నుంచి సాలూరు, రామభద్రపురం మీదుగా అక్రమంగా రవాణా అవుతున్న 800 కిలోల గంజాయి పట్టుకున్నారు.
- ఈ ఏడాది ఫిబ్రవరి 10న 150 కిలోల గంజాయి కొట్టక్కి పోలీస్ చెక్‌పోస్టు వద్ద పట్టుబడింది.



అక్రమంగా తరలిస్తున్న నిషేధిత సిగరెట్లను పరిశీలిస్తున్న ఎస్సై వి.ప్రసాదరావు

అక్రమ రవాణాపై మరింత నిఘా..



మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై మరింత నిఘా మండల బోర్డర్‌లో ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీ రాష్ట్రాలు ఉడడం వల్ల మండలం మీదుగా అక్రమ రవాణా జరిగే అవకాశం ఉంది. కొట్టక్కి పోలీస్ చెక్‌పోస్టు, స్థానిక బైపాస్ రోడ్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పటిష్టం చేశాం. ఏ విధమైన అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటాం.

వి ప్రసాదరావు, ఎస్సై, రామభద్రపురం

కూటమి ప్రభుత్వం వచ్చాకే అధికంగా అక్రమ రవాణా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాదక ద్రవ్యాలతో పాటు పలు నాసిక రకం వస్తువుల అక్రమ రవాణాకు అడ్డూ, అదుపూ లేకుండా పోయిందని పలు విమర్శలు వినిపిస్తున్నాయి.